23-07-2023 ప్రాత:మురళి ఓంశాంతి "అవ్యక్త బాప్ దాదా" రివైజ్ 16-03-95 మధువనం

"సర్వ ప్రాప్తి సంపన్న ఆత్మలకు గుర్తు - సంతుష్టత మరియు ప్రసన్నత"

ఈ రోజు సర్వ ప్రాప్తులను కలిగించే బాప్ దాదా తమ నలువైపులా ఉన్న ప్రాప్తి సంపన్నులైన పిల్లలను చూస్తున్నారు. మీరు సర్వ ప్రాప్తుల దాత, సంపన్నమైన మరియు సంపూర్ణమైన తండ్రి యొక్క పిల్లలు, కావున పిల్లలు ప్రతి ఒక్కరికీ తండ్రి సర్వ ప్రాప్తుల వారసత్వాన్ని ఇచ్చారు. కొందరికి 10 ఇచ్చి, కొందరికి 20 ఇచ్చారు అని కాదు. పిల్లలందరికీ సర్వ ప్రాప్తుల యొక్క అధికారాన్ని ఇచ్చారు. పిల్లలందరూ పూర్తి వారసత్వానికి అధికారులు. అధికారులైన పిల్లలు ప్రతి ఒక్కరూ స్వయములో ప్రాప్తుల యొక్క అధికారాన్ని ఎంతగా ప్రాప్తి చేసుకున్నారు అని బాప్ దాదా చూస్తున్నారు. తండ్రి అన్నింటినీ ఇచ్చారు. తండ్రిని సర్వ శక్తివంతుడు మరియు సంపన్న సాగరుడు అని అంటారు. కానీ పిల్లలు ఆ ప్రాప్తులను ఎంతవరకు తమవిగా చేసుకున్నారు? తండ్రి ద్వారా ఇవ్వబడిన వారసత్వాన్ని ఎప్పుడైతే తమదిగా చేసుకుంటారో, అప్పుడు ఎంతగా తమదిగా చేసుకుంటారో అంతగా - ఇది నా ఖజానా అని నషా మరియు సంతోషము ఉంటుంది. ఇచ్చింది తండ్రియే కానీ స్వయములో ధారణ చేసి తమదిగా చేసుకున్నారు. మరి ఏం చూసారు? తమదిగా చేసుకోవడంలో నంబరువారుగా అయిపోయారు. తండ్రి నంబరు తయారుచేయలేదు, కానీ తమ తమ ధారణ యొక్క యథా శక్తి అనేది నంబరువారుగా తయారుచేసింది. ఏ ఆత్మ అయితే సంపూర్ణ అధికారము మరియు సర్వ ప్రాప్తులతో సంపన్నమై, సదా అమృతవేళ నుండి రాత్రి వరకు ప్రాప్తుల యొక్క నషా మరియు అనుభవములో ఉంటుందో, ఆ ఆత్మ యొక్క గుర్తు ఏమిటి? ప్రాప్తులకు గుర్తు సంతుష్టత. వారు సదా సంతుష్టమణులుగా అయి ఇతరులకు కూడా సంతుష్టతా ప్రకాశం యొక్క వైబ్రేషన్లను వ్యాపింపజేస్తూ ఉంటారు. వారి ముఖము సదా ప్రసన్నచిత్తముగా కనిపిస్తుంది. ప్రసన్నచిత్తము అనగా సర్వ ప్రశ్నచిత్తము నుండి అతీతంగా ఉండడము. ఎటువంటి ప్రశ్నలు ఉండవు, ప్రసన్నంగా ఉంటారు. ఎందుకు, ఏమిటి, ఎలా - ఇవన్నీ సమాప్తమైపోతాయి. మరి ఇటువంటి ప్రసన్నచిత్తులుగా అయ్యారా? లేక ఇప్పుడు కూడా - ఇది ఏమిటి, ఇది ఎందుకు, ఇది ఎలా అవుతుంది, ఎప్పుడు అవుతుంది అనే ఈ ప్రశ్నలు అప్పుడప్పుడు కలుగుతున్నాయా? ఈ ప్రశ్నలు మనస్సులోనైనా లేక ఇతరుల ద్వారానైనా ఉత్పన్నమవుతున్నాయా? ప్రశ్నచిత్తులుగా ఉన్నారా లేక ప్రసన్నచిత్తులుగా ఉన్నారా? లేక అప్పుడప్పుడు ప్రశ్నచిత్తులుగా మరియు అప్పుడప్పుడు ప్రసన్నచిత్తులుగా ఉన్నారా? ఎలా ఉన్నారు? బ్రాహ్మణుల ఖజానాలో అప్రాప్తి అనే వస్తువేదీ లేదు అన్న గాయనం ఉంది. ఇది ఏ బ్రాహ్మణుల గాయనము? ఇది మీదా లేక ఇతరులు ఎవరైనా రానున్నారా? మీరే కదా! మరి అప్రాప్తి కలిగినప్పుడు అప్రాప్తి అనేది అసంతుష్టతకు కారణము. మీ అనుభవాన్ని చూడండి - ఎప్పుడైనా మనస్సు అసంతుష్టంగా అయినప్పుడు దానికి కారణం ఏమిటి? ఏదో ఒక అప్రాప్తిని అనుభవం చేస్తారు, అప్పుడే అసంతుష్టత ఏర్పడుతుంది. అప్రాప్తి అనే వస్తువేదీ లేదు అన్న గాయనమైతే ఉంది. ఇది ఇప్పటి గాయనమా లేక వినాశన సమయానికి సంబంధించిన గాయనమా? వినాశన సమయంలో సంపన్నంగా అవుతారా లేక ఇప్పుడే అవ్వాలా? మేము సదా ప్రసన్నచిత్తులుగా ఉంటాము, ఎప్పుడూ ఏ విషయంలోనూ తమకు సంబంధించి అయినా లేక ఇతరులకు సంబంధించి అయినా ప్రశ్నలు ఉత్పన్నమవ్వవు, సదా సంతుష్టంగా ఉంటాము అని ఎవరైతే భావిస్తున్నారో, అటువంటి సంతుష్ట ఆత్మలు ఎంతమంది ఉంటారు? చాలా మంది ఉన్నారా! అచ్ఛా! ఎవరైతే - సదా ప్రసన్నంగా ఉంటాము, మాయ ఎంత కదిలించినా కానీ మేము చలించము, మాయనే చలింపజేస్తాము, మాయ నమస్కారం చేస్తుంది, మేము అంగదులము, మాయ ఓడిపోతుంది కానీ మేము విజయులుగా ఉంటాము అని భావిస్తారో, వారు చేతులెత్తండి, సదా అన్న పదాన్ని గుర్తుంచుకోండి, అప్పుడప్పుడు వారు కాదు. చాలా కొద్దిమంది ఉన్నారు, కోట్లాది మందిలో కొందరు ఉన్నారు. ప్రశ్నార్థకమైతే ఉత్పన్నమవుతుంది కదా. ప్రశ్నార్థకము డిక్షనరీ నుండి తొలగిపోవాలి. అలజడి కూడా కలగకూడదు. కంప్యూటర్ వాడుతున్నప్పుడు అందులో వస్తుంది కదా? మీ బుద్ధి రూపీ కంప్యూటర్ లో సదా ఫుల్ స్టాప్ చిహ్నము రావాలి. ప్రశ్నార్థక చిహ్నము, ఆశ్చర్యార్థక చిహ్నము సమాప్తమైపోవాలి. అటువంటివారినే సదా ప్రసన్నచిత్తులు అని అంటారు. ఇటువంటి ప్రసన్నచిత్తులు ఇతరుల ప్రశ్నార్థకాలను కూడా సమాప్తం చేసేస్తారు. లేదంటే స్వయంలో ఒకవేళ ప్రశ్నార్థక చిహ్నము ఉంటే, ఏ విషయాన్ని అయినా విన్నప్పుడు, చూసినప్పుడు ఇలా అంటారు - అవును, ఇదైతే జరగకూడదు కానీ జరుగుతుంది, నేను కూడా అర్థం చేసుకున్నాను, జరగకూడదు - ఇలా అన్నీ మిక్స్ అయిపోతాయి. ఇతరుల ప్రశ్నలకు వారు ఇంకా అండర్ లైన్ చేస్తారు. అవును, ఇది సరికాదు, కానీ జరుగుతుంది... అని దానికి ఆధారాన్ని అయితే ఇచ్చేసారు కదా. కావున వారు ఇతరులను

ప్రసన్నచిత్తులుగా చెయ్యటానికి బదులుగా ఇంకా ప్రశ్నలను పెంచేసారు. ఎడిషన్ అయిపోయింది. వాస్తవానికి ఒక్కరి ప్రశ్నగా ఉండేది, ఇప్పుడు ఇద్దరిదిగా అయింది, ఇద్దరి నుండి నలుగురిదిగా అవుతుంది. ప్రసన్నచిత్త వైబ్రేషన్ బదులుగా ప్రశ్నచిత్త వైబ్రేషన్ త్వరగా వ్యాపిస్తుంది. అవును! అలా ఉంది... అని తోడును అందించేసారు. అవును! అని ఆశ్చర్యార్థకము వచ్చేసింది కదా. మరి ఫుల్ స్టాప్ అయితే అవ్వలేదు కదా. స్వయం పట్లనైనా - ఇది నాకు జరగకూడదు, ఇది నాకు లభించాలి, ఇది ఇతరులకు జరగకూడదు... కావున ఈ కావాలి, కావాలి అన్నది ప్రశ్నచిత్తులుగా చేసేస్తుంది, ప్రసన్నచిత్తులుగా కాదు. మరి అందరి లక్ష్యము ఏమిటి? సంతుష్టత, ప్రసన్నచిత్తత.

ఎవరి చిత్తమైతే ప్రసన్నముగా ఉంటుందో, వారి మనస్సు-బుద్ధి యొక్క వ్యర్థపు గతి వేగంగా ఉండదు. సదా నిర్మలంగా, నిర్మానంగా ఉంటారు. నిర్మానంగా ఉన్న కారణంగా తమ ప్రసన్నచిత్తత యొక్క ఛాయలో అందరికీ శీతలతను ఇస్తారు. ఎటువంటి అగ్ని సమానంగా కాలిపోతున్నటువంటి, చాలా వేడెక్కిన బుద్ధి కలిగి ఉన్నటువంటి వారైనా కానీ, ప్రసన్నచిత్త వైబ్రేషన్ల ఛాయలో శీతలంగా అయిపోతారు. బలహీనత ఏమిటి వస్తుంది? మామూలుగా సరిగ్గానే నడుస్తారు, తమదైన రీతిలో మంచిగా నడుస్తారు, కానీ ఎప్పుడైతే సంబంధ-సంపర్కాలలోకి వస్తారో, అప్పుడు ఇతరుల యొక్క బలహీనతను చూస్తూ, వింటూ, వర్ణన చేస్తూ ప్రభావంలోకి వచ్చేస్తారు. అప్పుడు - వీరు చేసారు కదా, కాబట్టే నా ద్వారా కూడా జరిగిపోయింది అని అంటారు. వీరు అన్నారు, అందుకే నేను కూడా అన్నాను. వారు యాభై సార్లు అన్నారు, నేను ఒక్క సారే అన్నాను. మళ్ళీ తండ్రి ముందు కూడా చాలా మధురాతి-మధురమైన మాటలను ఉంచుతారు, ఇలా అంటారు - బాబా, మీరు అర్థం చేసుకోండి కదా, ఇంతగా సహనం ఎంతవరకు చేస్తాము! ఎంతైనా పురుషార్థులము కదా, కావున ఎంతోకొంత వస్తుంది కదా! తండ్రికి కూడా అర్థం చేయించడం మొదలుపెడతారు. ఇక్కడ ఎవరైతే నిమిత్తులుగా ఉన్నారో, వారికి ఎన్నో కథలను వినిపిస్తారు. ఇలా ఉంది కదా, అలా ఉంది కదా, ఇలా ఉంది కదా... ఇలా ఉంది -ఇలా ఉంది అనే మాలను జపిస్తూ ఉంటారు. బాప్ దాదా సదా సూచనను ఇస్తూ ఉంటారు - ఇటువంటి విషయాలను కేవలం రెండు పదాలలో వర్ణన చేయండి. ఎక్కువగా వర్ణన చేయకండి ఎందుకంటే ఈ వ్యర్థమైన విషయాలు చాలా రుచికరంగా ఉంటాయి. ఆసక్తికరంగా అనిపిస్తాయి. ఎలాగైతే తినే పదార్థాలలో కూడా కాస్త తియ్యగా, పుల్లగా ఉండేవి మంచిగా అనిపిస్తాయి కదా మరియు చప్పగా సాధారణంగా ఉంటే ఇవైతే తింటూనే ఉంటాము అని అంటారు. అలాగే వ్యర్థమైన విషయాలను, వ్యర్థ చింతనను - వినడము, మాట్లాడడము మరియు చేయడము... ఇందులో నడుస్తూ, నడుస్తూ ఇంటరెస్ట్ పెరిగిపోతుంది. మళ్ళీ ఆలోచిస్తారు - నేను కోరుకోవడం లేదు కానీ వారు వినిపించారు కదా, కావున సరే విందాములే, వారి మనస్సును తేలిక చేద్దాము అని నేను అనుకున్నాను. వారి మనస్సు అయితే ఖాళీ అయ్యింది కానీ మీరు మనస్సును నింపుకున్నారు. అలా కొద్ది-కొద్దిగా మనస్సులో నింపుకుంటూ-నింపుకుంటూ అది ఇక సంస్కారంగా అయిపోతుంది మరియు ఎప్పుడైతే సంస్కారంగా అవుతుందో, అప్పుడిక ఇది తప్పు అని అనిపించను కూడా అనిపించదు. ఈ వ్యర్థ సంస్కారాలు బుద్ధి యొక్క నిర్ణయాన్ని సమాప్తం చేసేస్తాయి. అందుకే సదా సంతుష్టంగా ఉండేందుకు అన్నింటికన్నా సహజమైన విధి - సదా మీ ముందు ఏదో ఒక విశేష ప్రాప్తిని ఉంచుకోండి ఎందుకంటే ప్రాప్తిని ఎప్పుడూ మర్చిపోలేరు. జ్ఞానం పాయింట్లను మర్చిపోవచ్చు కానీ ఏ ప్రాప్తులనూ మర్చిపోరు. తండ్రి ద్వారా ఏమేమి లభించాయి, ఎంత లభించాయి... వెరైటీ ఇష్టమనిపిస్తుంది కదా! ఒకే విధంగా ఉంటే ఇష్టమనిపించదు. కావున మీరు మీ ప్రాప్తులను చూడండి - జ్ఞాన ఖజానా యొక్క ప్రాప్తి ఎంత ఉంది, యోగము ద్వారా శక్తుల యొక్క ప్రాప్తి ఎంత ఉంది, దివ్య గుణాల ప్రాప్తి ఎంత ఉంది, ప్రాక్టికల్గా నషాలో, సంతోషంలో ఉండే ప్రాప్తులు ఎన్ని ఉన్నాయి? చాలా పెద్ద లిస్ట్ ఉంది కదా! ఇంతకుముందు కూడా వినిపించాము - ఒకసారి ఒక గుణాన్ని, ఒకసారి మరొక గుణం యొక్క ప్రాప్తిని ఎదురుగా ఉంచుకుంటూ సంతుష్టంగా ఉండండి ఎందుకంటే ఒక్క గుణాన్ని తమదిగా చేసుకున్నా - ఏ విధంగా వికారాలకు పరస్పరం చాలా లోతైన సంబంధం ఉందో, ఒకవేళ బాహ్య రూపంలో క్రోధము ప్రత్యక్షమైనా ఆంతరిక రూపంలో పరిశీలించినట్లయితే క్రోధంతోపాటు లోభము మరియు అహంకారము కూడా తప్పకుండా ఉంటాయి. ఇవన్నీ పరస్పరంలో సహచరులు. కొన్ని ఇమర్జ్ రూపంలో ఉంటాయి, కొన్ని మర్జ్ రూపంలో ఉంటాయి. అలాగే గుణాలు కూడా ఏవైతే ఉన్నాయో, వాటికి కూడా పరస్పరంలో సంబంధం ఉంది. ఒక్క గుణాన్ని ఇమర్జ్ రూపంలో ఉంచుకున్నా కానీ, ఇతర గుణాలు కూడా దానితోపాటు మర్జ్ రూపంలో ఉంటాయి. కావున రోజూ ఏదో ఒక ప్రాప్తి స్వరూపం యొక్క అనుభవాన్ని తప్పకుండా చేయండి. ఒకవేళ ప్రాప్తి ఇమర్జ్ రూపంలో ఉన్నట్లయితే ప్రాప్తి ఎదురుగా అప్రాప్తి సమాప్తమైపోతుంది మరియు సదా సంతుష్టంగా ఉంటారు. మామూలుగా చూడండి, ప్రపంచంలో కూడా అందరూ ఏ ముఖ్య ప్రాప్తిని కోరుకుంటారు?

ప్రతి ఒక్కరూ తమ పేరు మంచిగా ఉండాలని, రెండవది గౌరవము, మూడవది ప్రతిష్ఠ బాగుండాలని కోరుకుంటారు.

పేరు, గౌరవం, ప్రతిష్ఠ - వీటిని ప్రాప్తి చేసుకోవాలని అనుకుంటారు. మీరు కూడా ఏం కోరుకుంటారు? మీరు కూడా ఇదే కోరుకుంటారు కదా! కానీ హద్దులో కాదు, అనంతములో. కావున ప్రపంచంలోని వారు హద్దులోని పేరు వెనుక పరిగెడుతూ ఉంటారు మరియు మీ పేరు విశ్వంలో ఎంత ఉన్నతంగా ఉంటుందో అంతగా ఇంకెవరికైనా ఉంటుందా? మరి మీరు మీ పేరును చూడండి. అన్నింటికన్నా పేరు యొక్క విశేషత ఏమిటంటే మీ పేరును ఎవరు జపిస్తారు? స్వయంగా భగవంతుడు మీ పేరును జపిస్తారు! మరి ఇంతకన్నా పెద్ద పేరు ఇంకేముంటుంది! మీ పేరుతో ఇప్పుడు చివరి జన్మలో కూడ అనేక ఆత్మలు తమ శరీర నిర్వహణను నడిపిస్తున్నారు. మీరు బ్రాహ్మణులు కదా, మరి బ్రాహ్మణుల పేరుతో ఈ రోజు కూడా నామమాత్రపు బ్రాహ్మణులు ఎంతగా సంపాదిస్తున్నారు! ఇప్పటివరకు కూడా నామమాత్రపు బ్రాహ్మణులు ఎంత ఉన్నతంగా గానం చేయబడతారు! కావున మీ పేరుకు ఎంత మహిమ ఉంది. ఇంతటి శ్రేష్ఠమైన పేరు మీది అయ్యింది, అందుకే హద్దులోని పేరు-ప్రతిష్టల వెనుక పరిగెత్తకండి. నా పేరును ఎప్పుడూ ఎందులోనూ తీసుకోనే తీసుకోరు, నా పేరు సదా వెనుకే ఉంటోంది, సేవ నేను చేస్తాను, పేరు ఇతరులకు వస్తుంది... ఇలా హద్దులోని పేరు వెనుక పరిగెత్తకండి. తండ్రి హృదయంలో మీ పేరు సదా శ్రేష్ఠంగా ఉంది. తండ్రి హృదయంలో మీ పేరు ఉన్నప్పుడు, ఏదైనా సేవలో లేక ఏదైనా ప్రోగ్రాంలో లేక ఏపైనా విషయాలలో మీ పేరు రాకపోయినా అందులో ఏముంది, తండ్రి వద్దనైతే ఉంది కదా! ఏ విధంగా భక్తి మార్గంలో హనుమంతుని చిత్రాన్ని చూపిస్తారు కదా, వారి హృదయంలో ఎవరు ఉన్నారు? రాముడు ఉన్నారు. అలాగే తండ్రి హృదయంలో ఎవరు ఉన్నారు? (పిల్లలు). మరి ఆ పిల్లలలో మీరు ఉన్నారా, లేరా? మరి అందరి పేర్లూ ఉన్నాయా! చూసారా? పక్కాయేనా? ఎప్పుడైనా మిస్ అయితే! మీ అందరి పేర్లు ఉన్నాయి! మరి వేరే పేరు వెనుక ఎందుకు పడుతున్నారు? ఎందుకంటే చాలా వరకు ఈ పేరు-ప్రతిష్ఠలు, గౌరవాలే కింద పడేస్తాయి, అలాగే ఈ పేరు-ప్రతిష్ఠలు, గౌరవాలే నషా కూడా ఎక్కిస్తాయి. కావున ప్రాప్తి యొక్క రూపంలో చూడండి. ఒకవేళ ఏదైనా కారణం వలన మీ పేరు గుప్తంగా ఉంది, కానీ మీరు నా పేరు ఉండాలి, అది యథార్థము అని భావిస్తున్నారు, ఏ ఆత్మతో అయినా ఉన్న లెక్కాచారాల కారణంగా లేక వారి సంస్కారాల కారణంగా మీ పేరు రావడం లేదు, మీరు రైటైనా వారు రాంగైనా వారికి పేరు వస్తుంది, మీకు కాదు, అయినా కానీ విజయ మాలలో మీ పేరు నిశ్చితమవుతుంది. అందుకే దీని గురించి కూడా చింతించకండి. ఈ రూపంలో మాయ ఎక్కువగా వస్తుంది. అందుకే ఇప్పుడు పొరపాటుగా పేరు మిస్ అయినా నష్టమేమీ లేదు. కానీ విజయమాలలో మీ పేరు మిస్ అవ్వ లేదు. మొదట మీ పేరే ఉంటుంది. కావున మీ పేరు యొక్క మహిమను గుర్తుంచుకోండి - నా పేరు తండ్రి హృదయంలో ఉంది, విజయమాలలో ఉంది, అంతిమం వరకు నా పేరు సేవ చేస్తోంది.

మరియు మీకు ఎంత గౌరవం ఉంటుంది? భగవంతుడు కూడా మిమ్మల్ని తమ కన్నా ముందు ఉంచారు! మొదట పిల్లలు. కావున స్వయంగా తండ్రియే గౌరవాన్ని ఇచ్చారు. ఎంతగా మీకు గౌరవం ఉంది, దాని ప్రమాణమును చూడండి, మీ జడ చిత్రాలకు కూడా చివరి జన్మ వరకు ఎంతటి గౌరవం ఉంది! వారికి తెలిసినా, తెలియకపోయినా, ఏ దేవీ-దేవతా చిత్రాలు ఉన్నా ఎంత గౌరవంగా వాటిని చూస్తారు! అన్నింటికన్నా శ్రేష్ఠమైన గౌరవము ఇప్పటివరకు మీ చిత్రాలకు కూడా లభించింది. ఇదే ప్రమాణము. మరి మీ చిత్రాలే ఇంత గౌరవనీయంగా, పూజనీయంగా ఉన్నాయంటే, ఎవరి పట్లనైతే గౌరవము ఉంచుతారో, వారిని పూజనీయులుగా భావించడం జరుగుతుంది. వీరు మా పూజ్యనీయులు, పూజ్యులు అని ఎల్లప్పుడూ అంటారు కదా. మీ చిత్రాలకు కూడా గౌరవం ఉంది, చైతన్యములో ఉంది కావుననే చిత్రాలకు కూడా గౌరవముంది, ఇదే ప్రాక్టికల్ ప్రూఫ్. ఒకవేళ చైతన్యంలో గౌరవం లేకపోతే చిత్రాలకు ఎలా లభిస్తుంది? తండ్రి అయితే సదా - మొదట పిల్లలు అని అంటారు. పిల్లలకు డబుల్ పూజ లభిస్తుంది, తండ్రికి సింగిల్ పూజ లభిస్తుంది. మరి మీ గౌరవము తండ్రి కన్నా ఎక్కువగా ఉన్నట్లే కదా! ఇంతటి శ్రేష్ఠమైన గౌరవం లభించింది! కావున ఎప్పుడైనా ఏదైనా హద్దులోని గౌరవం యొక్క విషయం వస్తే ఇలా ఆలోచించండి - ఆత్మల గౌరవం ఏం చేస్తుంది, నాకు స్వయంగా పరమాత్ముని గౌరవమే లభించింది. మేము ఇంత చేసినా గౌరవం ఇవ్వరు, అడగనే అడగరు అని ఈ విధంగా ఆలోచించకండి! ఇలా ఆలోచించడం వ్యర్థము ఎందుకంటే ఎంతగా మీరు హద్దులోని గౌరవాల వెనుక పరిగెడతారో, ఈ హద్దులోని విషయాలన్నీ నీడ వంటివి. నీడ వెనుక పరిగెత్తడం ద్వారా ఎప్పుడైనా నీడ లభిస్తుందా, లేక ఇంకా ముందుకు వెళ్తూ ఉంటుందా? కావున ఈ హద్దులోని పేరు, ఈ హద్దులోని గౌరవము - ఇవి నీడ వంటివి. ఇవి మాయ యొక్క ఎండలో కనిపిస్తాయి కానీ నిజానికి అవేమీ కావు. కావున పేరు కూడా మీకు లభించింది, గౌరవం కూడా లభించింది మరియు ప్రతిష్ఠ ఎంతగా ఉంది! మీ ఒక్కొక్క ప్రతిష్టలను గుర్తు చేసుకోండి మరియు ఎవరు మిమ్మల్ని ఇంతటి ప్రతిష్టలో కూర్చోబెట్టారు? తండ్రి కూర్చోబెట్టారు. మీరు తండ్రి హృదయ సింహాసనాధికారులు. అన్నింటికన్నా పెద్ద ప్రతిష్ట - రాజ్య పదవి కదా! కావున మీకు సింహాసనము, కిరీటము లభించాయి కదా! ఎవరైతే పరమాత్మ

సింహాసనాధికారులుగా ఉన్నారో, వారికి ఇంతకన్నా గొప్ప ప్రతిష్ఠ ఏముంటుంది!

అప్పుడప్పుడు నిర్ణయం తీసుకోవడంలో ఒక చిన్న పొరపాటు చేసేస్తారు. నిజమైన ప్రతిష్ఠ ఏదైతే ఉందో, ఆత్మిక ప్రతిష్ఠ ఏదైతే ఉందో, అది ఎప్పుడూ అభిమానం యొక్క ఫీలింగ్ ను ఇవ్వదు. అప్పుడప్పుడు ఏం చేస్తారు? వాస్తవానికి ఉండేది అభిమానము కానీ - మా ఈ ప్రతిష్ఠను అయితే ఉంచాలి, ఇంతటి గౌరవాన్ని అయితే ఉంచాలి కదా అని భావిస్తారు, ప్రతిష్ఠలో ఉండడం మంచిది, కానీ అది ప్రతిష్ఠయా లేక అభిమానమా అన్నదానిని మంచి రీతిలో చెక్ చేసుకోండి. అప్పుడప్పుడు అభిమానాన్ని ప్రతిష్ఠగా భావిస్తారు, అప్పుడిక నిర్మానచిత్తులుగా ఉండరు. మీరు మీ ప్రతిష్ఠను రియల్ గా భావిస్తారు కానీ ఇతరులు ఇది అభిమానము అని భావిస్తారు, కొద్దిగా ఏమైనా అన్నా మీకు అవమానంగా అనిపిస్తుంది. అభిమానం కలవారికి అవమానము చాలా త్వరగా ఫీల్ అవుతుంది. కొద్దిగా అయినా ఎవరైనా హాస్యానికి ఏమైనా అన్నా కూడా అది అవమానంగా అనిపిస్తుంది. ఇది అభిమానానికి గుర్తు. లేదు, నేను అయితే అలా లేను, ఇలా అనవచ్చా అని ఆలోచిస్తారు. మరి సరైన నిర్ణయాన్ని తీసుకోండి. ఆ సమయంలో నిర్ణయంలో పొరపాటు చేస్తారు. యథార్థానికి బదులుగా మిక్స్ అవుతుంది మరియు మీరు దానిని యథార్థంగా భావిస్తారు. కావున - వీరు చాలా మంచివారు కానీ, వీరి మాటలు, లేవడము, కూర్చోవడము అదంతా అభిమానంగా అనిపిస్తుంది - అని అందరూ అంటారు. ఇలా ఎవరైనా అన్నా అందులో అవమానపు ఫీలింగ్ వచ్చేస్తుంది. మరి స్వమానము మరియు అభిమానం యొక్క తేడాను కూడా చెక్ చేసుకోండి. స్వమానము ఎంత పెద్దది, ప్రతిష్ఠ ఎంత పెద్దది, ఆ అనంతమైన పేరు, గౌరవం మరియు ప్రతిష్ఠను సదా ఇమర్జ్ రూపంలో ఉంచుకోండి. మర్జ్ కాదు, ఇమర్జ్ చేయండి. ఏ విధంగా స్మృతిలో అప్పుడప్పుడు నిర్లక్ష్యం వస్తే - మేము ఉన్నదే తండ్రికి చెందినవారిగా, ఇక స్మృతి ఏం చేయాలి... అని అంటారు. కానీ ఇమర్జ్ సంకల్పాలతో ప్రాప్తి యొక్క అనుభవం కలుగుతుంది. అలాగే ప్రతి ధారణలోనూ అలర్ట్ గా ఉండండి, నిర్లక్ష్యులుగా అవ్వకండి ఎందుకంటే సమయం సమీపంగా వస్తుంది మరియు సమయము సమీపంగా రావడమనేది ఏ సూచనను ఇస్తుంది? సమానంగా అవ్వండి, సంపన్నంగా అవ్వండి. కావున సమయం యొక్క ఛాలెంజ్ ను చూడండి మరియు సర్వ ప్రాప్తులతో సంపన్నంగా అవ్వండి. అచ్ఛా.

నలువైపులా ఉన్న సదా సర్వ ప్రాప్తి స్వరూప ఆత్మలకు, సదా సంతుష్టంగా, సదా ప్రసన్నచిత్తంగా ఉండే శ్రేష్ఠ ఆత్మలకు, సదా స్వయాన్ని శ్రేష్ఠమైన పేరు, గౌరవం మరియు ప్రతిష్ఠకు అధికారులుగా అనుభవం చేసే సమీప ఆత్మలకు, సదా సర్వులకు సంతుష్టత యొక్క వైబ్రేషన్ల లైట్-మైట్ ను ఇచ్చే ప్రసన్నచిత్త ఆత్మలకు బాప్ దాదా యొక్క ప్రియస్మృతులు మరియు నమస్తే.

వరదానము:- ప్రతి క్షణము స్వయాన్ని నిండుగా అనుభవం చేస్తూ నిరంతరము సురక్షితంగా ఉండే స్మృతి మరియు సమర్థ స్వరూపులుగా కండి

బాప్ దాదా ద్వారా సంగమయుగంలో ఏయే ఖజానాలైతే లభించాయో, వాటితో స్వయాన్ని సదా నిండుగా ఉంచుకోండి. ఎంతగా నిండుగా ఉంటారో, అంతగా అలజడి లేకుండా ఉంటారు. నిండుగా ఉన్న వస్తువులోకి ఇంకే వస్తువు దూరదు. సహన శక్తి లేక శాంతి శక్తి లేదు, కొద్దిగా క్రోధము లేక ఆవేశము వచ్చేస్తున్నాయి అని అనలేరు. ఎప్పుడైతే నిర్లక్ష్యము ఉంటుందో లేక డబుల్ లాక్ ఉండదో, అప్పుడే ఏ శత్రువైనా బలవంతంగా లోపలికి వస్తారు. స్మృతి మరియు సేవ యొక్క డబుల్ లాక్ వేయండి, స్మృతి స్వరూపులుగా ఉండండి, అప్పుడు సమర్థులుగా అయి సదా సురక్షితంగా ఉంటారు.

స్లోగన్:- విశ్వ నవ నిర్మాణము చేసేందుకు మీ స్థితిని నిర్మానచిత్తముగా తయారుచేసుకోండి.